ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 127 | పేజీలు: 5 | వెల: రూ.3/- | శుక్రవారం 16 ఆగస్ట్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




### సీఎం స్థాయికి తగ్గట్లుగా
## రేవంత్ ప్రవర్తించడం లేదు
**విమర్శలను తిప్పికొట్టిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు**

హైదరాబాద్, ఆగస్ట్ 15 (ప్రభాత ఉదయం): సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి స్థాయికి తగ్గట్టు ప్రవర్తించడం లేదని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి తనపై చేసిన విమర్శలను హరీశ్‌రావు ఎక్స్ వేదికగా తిప్పికొట్టారు. దేవుళ్లపై ఒట్టు పెట్టుకొని మాట మీద నిలబడక పోగా.. నిస్సిగ్గుగా భారాస, నాపై విమర్శలు ..మిగతా 2లో

# తెలంగాణకు స్వేచ్ఛ కల్పించాం

**ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నాం**

- ఆరు గ్యారెంటీలను అమలు చేసి చూపాం
- రుణమాఫీతో రైతన్నల్లో ఆనందం కల్పించాం
- త్వరలోనే రైతు భరోసా కూడా చేపడతాం
- సన్న ధాన్యానికి 5వందల బోనస్ ప్రకటించాం
- అందెశ్రీ జయజయహేను రాష్ట్ర గీతంగా ప్రకటించాం
- సాంస్కృతిక పునరుజ్జీవానికి నాంది పలికాం
- అప్పలకుప్పగా చేసిన రాష్ట్రాన్ని సరిదిద్దుతున్నాం
- అధిక వడ్డీలకు అప్పలు తెచ్చి..మోయలేని భారం కల్పించం
- నెహ్రూ నుంచి రాజీవ్ వరకు అందరూ దేశాం కోసం కృషి
- నెహ్రూ విధానాలే సస్య విప్లవానికి నాంది పలికాయి
- గోల్కొండ కోట వేదికగా సిఎం రేవంత్ స్వాతంత్ర్య సందేశం




హైదరాబాద్, ఆగస్ట్ 15 (ప్రభాత ఉదయం): తెలంగాణలో గత పదేళ్లలో కోల్పోయిన స్వేచ్ఛను పునరుద్ధరించడంతో పాటు.. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ చిత్తశుద్ధితో పాలన సాగిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆరుగ్యారెంటీల్లో భాగంగా రైతులకు రుణమాఫీ చేశామని, అలాగే రైతుభరోసా కూడా త్వరలోనే అందచేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేయడం కాంగ్రెస్ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ సాధించుకొని దశాబ్ద కాలమైనా రాష్ట్ర గీతం లేని పరిస్థితి మొన్నటి వరకు ఉందని సీఎం రేవంత్ అన్నారు. ప్రముఖ ప్రజాకవి అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ...' గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించి ఆ లోటును భర్తీ చేశామని, తద్వారా సాంస్కృతిక పునరుజ్జీవనానికి నాంది పలికామని వ్యాఖ్యానించారు. నేటి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు ఎందరో మహనీయుల త్యాగ ఫలం అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. గోల్కొండ కోటలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రేవంత్ పాల్గొన్నారు. జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలను సీఎం తిలకించారు. అంతకుముందు పరేగడ్ గ్రౌండ్‌లో అమరులకు నివాళి అర్పించారు. మా సిద్ధాంతం గాంధీ సిద్ధాంతం. మా వాదం గాంధేయవాదం. తెలంగాణ రాష్ట్ర పేరును సూచించే సంక్షిప్త అక్షరాల విషయంలో టిఎస్ స్థానంలోటిజిని ప్రభుత్వం పునరుద్ధరించింది. ఇది ప్రజల ఆకాంక్ష. మా ప్రభుత్వం ..మిగతా 2లో





### ప్రపంచ నైపుణ్యాల
## రాజధానిగా భారత్
**తయారీ రంగంలో గ్లోబల్ హబ్‌గా మారాలి**

- ప్రపంచానికే అన్నం పెట్టే స్థాయికి భారత్ ఎదగాలి
- ప్రపంచం ఎదుగుదలలో భారత్‌ది ప్రత్యేక పాత్ర
- వికసిత్ భారత్ 2047' నినాదం.. 140 కోట్ల మంది ప్రజల కల
- వోకల్ ఫర్ లోకల్ అనేది ప్రభుత్వ వ్యూహం
- దేశాభివృద్ధికి నూతన ఆర్థిక విధానాలు అమలు
- అన్నిరంగాల్లో ఆధునిక సాంకేతికతకు పెద్దపీట
- అంతరిక్ష రంగంలో బలమైన శక్తిగా ఎదిగిన భారత్
- వచ్చే ఐదేళ్లలో 75వేల మెడికల్ సీట్ల పెరుగుదల
- నూతన నేర చట్టాలతో న్యాయానికే ప్రాధాన్యత
- మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు
- ఎర్రకోట వేదికగా దేశ ప్రజలకు ప్రధాని మోడీ సందేశం
- వరుసగా 11వ సారి జాతీయ పతాకావిష్కరణ



న్యూఢిల్లీ, ఆగస్ట్ 15 (ప్రభాత ఉదయం): భారత్‌ను ప్రపంచ నైపుణ్యాల రాజధానిగా మార్చాలని, తయారీ రంగంలో గ్లోబల్ హబ్‌గా భారత్‌ను మార్చాలన్నదే లక్ష్యమని ప్రధాని మోడీ అన్నారు. 2047 నాటికి వికసిత భారత్ మనందరి లక్ష్యమని తెలిపారు. ప్రపంచానికే అన్నం పెట్టే స్థాయికి భారత దేశం ఎదగాలని, దేశాభివృద్ధికి పాలనా సంస్కరణలు అవసరమని, అలాగే న్యాయ వ్యవస్థలో సంస్కరణలు అవసరమని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. అంతరిక్షంలో భారత్ స్పేస్ స్టేషన్ త్వరలో సాకారం కావాలన్నారు. మనం అనుకుంటే 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని, 'వికసిత్ భారత్ 2047' నినాదం.. 140 కోట్ల మంది ప్రజల కలల తీర్మానమని అన్నారు. దళితులు, పీడితులు, ఆదివాసీలు గౌరవంగా బతకాలని, వోకల్ ఫర్ లోకల్ అనేది ప్రభుత్వ వ్యూహమని, వోకల్ ఫర్ లోకల్ నినాదం ఆర్థిక వ్యవస్థలో మార్పు తెచ్చిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.. భారీ సంస్కరణలు తెచ్చేందుకు ప్రభుత్వం సంకల్పం తీసుకుందని, దేశాభివృద్ధికి నూతన ఆర్థిక విధానాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఉపాధి కల్పనలో గణనీయమైన ప్రగతి సాధించామని, యువతకు నూతన ఉపాధి అవకాశాలు అందుబాటులో ..మిగతా 2లో

## రాజ్‌భవన్‌లో ఎట్‌హోమ్‌కు సిఎం రేవంత్ హాజరు
**స్వయంగా స్వాగతించిన గవర్నర్ జిష్ణుదేవ్**
**రెండ్రోజుల పర్యటకు ఢిల్లీకి సిఎం రేవంత్**

హైదరాబాద్, ఆగస్ట్ 15 (ప్రభాత ఉదయం): పంద్రాగస్ట్‌ను పురస్కరించుకుని రాజ్‌భవన్‌లో గవర్నర్ బిష్ణుదేవ్ తేనీటి విందు ఇచ్చారు. ఎట్‌హోమ్ కార్యక్రమం నిర్వహిచడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమానికి సిఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు పలువురు హాజరయ్యారు. అలాగే పలువురు అధికారులు, ఇతర నేతలు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా వగర్నర్ దంపతులు స్వయంగా ఆహుతను ఆహ్వానించారు. ఇదిలావుంటే కార్యక్రమానికి విపక్ష బిఆర్ఎ దూరంగా ఉంది. ఇకపోతే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ వెళ్లనున్నారు. రెండ్రోజులపాటు పర్యటించి వివిధ కంపెనీలతో భేటీ కానున్నారు. అలాగే రాష్టానికి సంబంధించిన పలు అంశాలపై ..మిగతా 2లో





### సీతారామ ప్రాజెక్ట్
## జాతికి అంకితం
**సీతారామ ప్రాజెక్టు పైలాన్ ఆవిష్కరణ**
**బాగోతం బయటపడుతుందనే డిపిఆర్ ఇవ్వలేదు**
**ఖమ్మం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే సీతారామ ప్రాజెక్ట్**
**పదేళ్లు అధికారంలో ఉన్నా కెసిఆర్ ఖమ్మంను పట్టించుకోలేదు**
**సీతారామ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవంతో సిఎం రేవంత్ రెడ్డి**

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 15 (ప్రభాత ఉదయం): సీతారామ ప్రాజెక్ట్‌పై మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు బోగస్ మాటలు చెబుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పూసుగూడెంలోని సీతారామ ప్రాజెక్టుని మంత్రుల సమక్షంలో ఆయన ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం సీతారామ ప్రాజెక్టు పైలాన్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. తొలి పంప్‌హౌస్‌ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ములకలపల్లి మండలం కమలాపురంలో మూడో పంప్ హౌస్‌ను మంత్రి భట్టి విక్రమార్క స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. పదేళ్లు అధికారంలో ఉండి కేసీఆర్, హరీశ్‌రావు సీతారామ ప్రాజెక్టు డీపీఆరే ఇవ్వలేదని.. కమీషన్ల బాగోతం బయట పడుతుందనే అలా ..మిగతా 2లో

### స్కిల్ యూనివర్సిటీ ఛైర్మన్‌గా
## ఆనంద్ మహీంద్రా
**ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం**

హైదరాబాద్, ఆగస్ట్ 15 (ప్రభాత ఉదయం): తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్‌పర్సన్‌గా ప్రముఖ పారిశ్రామిక వేత్త, మహీంద్రా గ్రూపు సంస్థల ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆటోమొబైల్, ఏయిరోస్పేస్, డిఫెన్స్, ఎనర్జీ, ఐటీ వంటి ప్రముఖ రంగాల్లో మహీంద్రా గ్రూపు సంస్థలకు ఆయన ఛైర్మన్‌గా ఉన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో స్కిల్స్ ఇండియా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ ఇటీవలే అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందింది. దీని ఏర్పాటు కోసం ఆగస్టు ఒకటో తేదీన రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట ..మిగతా 2లో



### రుణమాఫీ పేరుతో రైతులను
## మభ్యపెడుతున్న ప్రభుత్వం
**మాఫీ జరగనందువల్లనే రాహుల్ రాష్ట్రానికి రాలేదు**
**అప్పుడు కరెంట్ పోతే వార్త.. ఇప్పుడు కరెంట్ ఉంటే వార్త**
**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్**

హైదరాబాద్, ఆగస్ట్ 15 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ సర్కార్ రూ.2 లక్షల రైతు రుణమాఫీ పేరుతో రైతులను మభ్యపెడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావు ఆరోపించారు. రుణమాఫీ సంపూర్ణంగా చేయనందుకే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాష్ట్రానికి రాలేదని విమర్శించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో జెండా ఆవిష్కరణలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు నుంచి ఎప్పుడైనా తీర్పు రావొచ్చని తెలిపారు. మైసూర్ బజ్జీలో మైసూర్ ఉండదనేది ఎంత వాస్తవమో, జాబ్ క్యాలెండర్లో జాబ్స్ ఉండయనేది ..మిగతా 2లో



## ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేసి చూపాం



**హరీష్ రావు...రాజీనామా చేసి నీ ధైర్యం చూపాలి**
**లేదా అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాయాలి**
**వైరా సభలో సిఎం రేవంత్ రెడ్డి సవాల్**
**ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండడం మా నైజం**
**వైరాలో చివరి విడత రుణమాఫీకి శ్రీకారం**
**మూడో విడతలో 14.4 లక్షల మంది రైతులకు రుణమాఫీ**
**వైరా సభలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి**

2

# తెలంగాణకు స్వేచ్ఛ కల్పించాం

మొదటి పేజీ తరువాయి...

అధికారం చేపట్టేనాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా విధ్వంసమై ఉంది. గత పది సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అప్పు దాదాపు 10 రెట్లు పెరిగింది. రాష్ట్ర ఆవిర్భావ సమయంలో రూ.75,577 కోట్లుగా ఉన్న అప్పు, గత ఏడాది డిసెంబరు నాటికి దాదాపు రూ.7 లక్షల కోట్లకు చేరింది. దీనిపై శ్వేతపత్రం కూడా విడుదల చేశాం. దయనీయ స్థితిలో ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచేందుకు ఆర్థిక పునరుజ్జీవనం అవసరం అని భావించాం. ఆ దిశగా రాష్ట్ర అప్పులను రీస్ట్రక్చర్ చేయించే ప్రయత్నంలో ఉన్నాం. ఇటీవల అమెరికా పర్యటనలో ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో సమావేశమయ్యాం. తక్కువ వడ్డీలతో రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చుకునే అంశంపై మా మధ్య సానుకూల చర్చలు జరిగాయని చెప్పడానికి సంతోషిస్తున్నాను. గతంలో మాదిరిగా అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి... రాష్ట్ర ప్రజల నెత్తిన మోయలేని
భారం మోపే పనులు మేం చేయబోం అని స్పష్టం చేశారు. ఆర్థిక అవరోధాలు ఉన్నా ప్రతి ఇంటా సౌభాగ్యాన్ని నింపాలనే మహాసంకల్పంతో రూపొందించిన అభయహస్తం హామీలన్నీ తూ.చ తప్పకుండా అమలు చేసే ప్రయత్నం చేస్తున్నాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.. పంచవర్ష ప్రణాళికలు రచించి, ఈ దేశానికి వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధి అన్నవి రెండు కళ్లు అని నమ్మి ఆ దిశగా తొలి అడుగులు వేయించిన దార్శనికుడు పండిట్ నెహ్రూ, ఆయన ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను మనం ఈ రోజు ఆధునిక దేవాలయాలుగా పిలుచు కుంటున్నాం. ఈ దేశంలో కోట్లాది ఎకరాలు పంటలతో పచ్చతోరణాన్ని కట్టుకున్నాయంటే దానికి కారణం నెహ్రూ ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులే. నాగార్జున సాగర్, శ్రీశైలం, భాక్రానంగల్, శ్రీరాంసాగర్ లాంటి ప్రాజెక్టులు నెహ్రూ ప్రారంభిస్తే... ఆ తర్వాత వాటిని పూర్తి చేసి, కోట్లాది మంది రైతుల పొలాలకు సాగు జలాలు పారించిన ఘనత స్వర్గీయ ఇందిరాగాంధీకి దక్కుతుంది. అంతేకాదు, పారిశ్రామికంగా బిహెచ్ఇఎల్, ఇసిఐఎల్, ఐడిపిఎల్, మిథాని వంటి ఎన్నో ప్రభుత్వ రంగ సంస్థలు ఆ స్వర్ణయుగంలో నెలకొల్పబడినవే. హరిత విప్లవం, శ్వేత విప్లవం, నీలి విప్లవం చేపట్టి అన్నిరంగాల సమగ్రాభివృద్ధికి కృషిచేసిన ఘనత నాటి ప్రభుత్వాలది. బడా పారిశ్రామిక వేత్తలకు మాత్రమే తెలిసిన బ్యాంకింగ్ వ్యవస్థను జాతీయాకరణతో గ్రామీణ ప్రజల చెంతకు చేర్చిన ఘనత, ప్రతి పౌరుడుకి బ్యాంకును అందుబాటులోకి తెచ్చిన గొప్పతనం ఆ నాటి దార్శనికుల వల్లనే జరిగింది. 1947 వరకూ ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకున్న మనదేశం, ఈ నాడు ప్రపంచంలో ఆహారధాన్యాలను అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న దేశాలలో ఒకటిగా ఎదగడానికి కారణం స్వర్గీయ లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ ప్రవేశ పెట్టిన హరిత విప్లవమే. ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం ప్రజల సామాజిక, ఆర్థిక పునరుజ్జీవనానికి గీటురాయిగా మారింది. స్వర్గీయ రాజీవ్ గాంధీ ప్రధానిగా దేశం టెలికమ్యూనికేషన్స్ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికారు.

అంతరిక్ష, అణుశక్తి కార్యక్రమాల్లో స్వదేశీ పరిజ్ఞానాన్ని వినియోగించే అతికొద్ది దేశాల సరసన భారతదేశాన్ని ఆనాడే నిలుపగలిగారు‘ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ చరిత్రలోనే అహింసనే ఆయుధంగా మలిచి చేసిన మహా సంగ్రామం మన స్వాతంత్ర్య పోరాటమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వరంగల్ డిక్లరేషన్ అమలులో భాగంగా రుణమాఫీ చేస్తున్నాం. రుణమాఫీ అసాధ్యమని కొందరు వక్రభాష్యం చెప్పారు. రూ.2 లక్షల వరకు అమలు చేసి చూపిస్తున్నాం. సాంకేతిక కారణాలతో కొందరికి రుణమాఫీ కావడం లేదు. అలాంటి వారిని గుర్తించి అందజేస్తాం. కలెక్టరేట్లలో కౌంటర్లు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తాం. ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండు ఇప్పటికే అమలు చేశాం. ఆరోగ్యశ్రీ పథకానికి పూర్వ వైభవం తెచ్చాం. దీని పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం. ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునికీకరణకు కట్టుబడి ఉన్నాం. అర్హులైన అందరికీ రైతు భరోసా అందిస్తాం. గత ప్రభుత్వం అనర్హులకు రైతుబంధు ఇచ్చింది. త్వరలో రైతు భరోసా పథకాన్ని ప్రారంభించబోతున్నాం. సన్నరకం వరి సాగును ప్రోత్సహించేందుకు రూ.500 బోనస్ చెల్లిస్తాం. దీని కోసం 33 రకాల వరి ధాన్యాలను గుర్తించాం. పెండింగ్ ధరణి దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించాం. భూ సమస్యల పరిష్కారానికి సమగ్ర చట్టం తీసుకురావాలని భావిస్తున్నాం. డ్రగ్స్ నియంత్రణకు కఠిన నిర్ణయాలు తీసుకున్నాం. టీ-న్యాబ్‌ను బలోపేతం చేశాం. సైబర్ మోసాలు, నేరాల బారిన పడిన వారికి సహాయం కోసం 1930 నంబర్ ఏర్పాటు చేశాం. త్వరలో విద్యా కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. అంగన్వాడీలను ప్రీప్రైమరీ స్కూళ్లుగా మార్చబోతున్నాం. ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లను నిర్మిస్తాం. ఇటీవలే స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేశాం. ఇది విప్లవాత్మక మార్పులకు మలుపు కాబోతోంది. స్కిల్ వర్సిటీకి ఆనంద్ మహీంద్రాను ఛైర్మన్‌గా నియమించాం. తెలంగాణను ప్రపంచానికి ముఖద్వారంగా మార్చాలి. రాష్ట్ర బ్రాండ్‌ను విశ్వవేదికపై సగర్వంగా చాటాలి. ఇటీవల పెట్టుబడుల సాధన కోసం అమెరికాలో పర్యటించాం. దిగ్గజ సంస్థల అధినేతలు, ప్రతినిధులతో భేటీ అయ్యాం. ఫ్యూచర్ స్టేట్‌గా తెలంగాణను వారికి పరిచయం చేశాం. మరోవైపు హైదరాబాద్ నగరాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించడానికి హైడ్రా ఏర్పాటు చేసుకున్నాం.‘ అని రేవంత్‌రెడ్డి తెలిపారు. పాలకులు తప్పు చేస్తే నిలదీసే స్వేచ్ఛ తెలంగాణలో ఉందన్నారు. పరిపాలనలో లోటుపాట్లు ఉంటే సూచనలు, సలహాలు స్వీకరించే సౌలభ్యం కల్పించామని తెలిపారు. ప్రతి నిర్ణయంలో ప్రజాహితాన్ని చూస్తున్నామని... లోతైన సమీక్షలతో మంచి చెడులను విశ్లేషించామన్నారు. మెజారిటీ వర్గాల ప్రయోజనాలే ప్రామాణికంగా పాలన చేస్తున్నామని.. ఇంతటి వ్యవస్థలో లోటు పాట్లు ఉండొచ్చని... మా నిర్ణయాలలో తప్పు జరిగితే సరిదిద్దుకుంటున్నామన్నారు. ఎవరైనా తప్పుడు ఆరోపణలు చేసినప్పటికీ సంయమనం పాటిస్తున్నామని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యం అన్న స్పృహ, స్ఫూర్తితో పాలన చేస్తున్నామన్నారు.
తాము అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామన్నామని దాన్ని అక్షరాలా అమలు చేస్తున్నామని తెలిపారు రేవంత్ రెడ్డి. ఇచ్చిన మాట ప్రకారం ప్రజాపాలన సాగిస్తున్నామని... ప్రజలందరికీ సామాజిక న్యాయం, సమానావకాశాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. అమరుల ఆశయాలు, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా సాంస్కృతిక పునరుజ్జీవనం, ఆర్థిక పునరుజ్జీవనానికి సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రముఖ ప్రజాకవి అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ...' గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించి తెలంగాణ సాధించుకొని దశాబ్ద కాలమైనా రాష్ట్ర గీతం లేని పరిస్థితిని భర్తీ చేశామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో విస్తృత వైద్యసేవలు అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి ప్రత్యేక డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు జారీచేసే చేస్తామని తెలిపారు. పౌరుల ఆరోగ్య సంబంధిత సమాచారం ఒకే చోట అందుబాటులో ఉంటే సులభంగా రోగనిర్ధారణ, సత్వర చికిత్సకు వీలుంటుందనే ఈ ఆలోచన చేశామన్నారు. 2014లో కాంగ్రెస్ అధికారం కోల్పోయే నాటికి గ్యాస్ ధర 410 రూపాయలు ఉంటే..నేడు అది 1200లకు చేరిందన్నారు. అందుకే తిరిగి దాన్ని 500 రూపాయలకే ఇవ్వాలన్న సంకల్పంతో మహాలక్ష్మీ పథకం ఫిబ్రవరి 27న ప్రారంభించామన్నారు. 40 లక్షల మంది లబ్దిదారులతో మొదలైన ఈ పథకం నేడు 43 లక్షల మందికి చేరిందన్నారు. పేదలకు విద్యుత్ బిల్లుల భారం తగ్గించాలన్న భావనతో గృహజ్యోతి పథకం అమలు చేస్తున్నామన్నారు. 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వాడే ప్రతి ఇంటికి ఉచిత వెలుగులు పంచుతున్నామని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ప్రస్తుతం 47 లక్షల 13 వేల 112 మంది లబ్ది పొందుతున్నారని తెలిపారు.
వ్యవసాయరంగం అత్యంత ప్రాధాన్యత అంశంగా తమ ప్రభుత్వం ఉందన్నారు. అందుకే బ్జెట్‌లో 72,659 కోట్ల రూపాయలు కేటాయించామని గుర్తు చేశారు. రుణ భారంతో ఇబ్బంది పడ్డ రైతన్నలు తల ఎత్తుకొని దర్జాగా తిరిగే రోజులు వచ్చాయని పేర్కొన్నారు. రైతు భరోసా పథకాన్ని సక్రమంగా అమలు చేయాలన్న లక్ష్యంతో విధివిధానాలు రూపొందిస్తోందని తెలిపారు.
ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉపసంఘం రాష్ట్రంలో పర్యటించి రైతులు, రైతు సంఘాలు, రైతు కూలీలు, మేధావుల అభిప్రాయాలు తీసుకొని విధి విధానాలు రూపొందిస్తోందన్నారు. అనంతరం పథకం అమలు చేస్తామని తెలిపారు. వరి సాగు చాలా విస్తారంగా జరుగుతోందన్న రేవంత్ పండిన పంటకు సరైన గిట్టుబాటు ధర రాక రైతులు నష్టపోతున్నారన్నారు. అందుకే సన్నరకం వరి ధాన్యం సాగు ప్రోత్సహించేందుకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లించాలని నిర్ణయించినట్టు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరను కల్పిస్తూ, కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. రైతుల సౌలభ్యం కోసం మొన్నటి రబీ సీజన్‌లో ధాన్యం సేకరణ కేంద్రాల సంఖ్యను 7,178కి పెంచామన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లో చెల్లింపులు చేస్తున్నామని వివరించారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నాం. నకిలీ విత్తన అక్రమార్కులను ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేస్తోందన్నారు.



## రుణమాఫీ పేరుతో రైతులను
# మభ్యపెడుతున్న ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి...

అంతే నిజమని సెట్కెర్లు వేశారు. ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్ అబద్ధం చెప్పారని మండిపడ్డారు. స్టేషన్ ఘనపూర్‌కి త్వరలోనే ఉప ఎన్నిక వస్తుందని.. అక్కడి నుంచి బీఆర్ఎస్ నేత రాజయ్య గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కడియం కావ్య, శ్రీహరిని ప్రజలు త్వరలోనే నిలదీస్తారని హెచ్చరించారు. 'ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావుపై హైకోర్టుకు వెళ్లాం. మిగతా వారిపై కూడా సుప్రీంకోర్టుకు వెళతాం. అసెంబ్లీ ఎన్నికల్లో 14 స్థానాల్లో స్వల్ప తేడాతో ఓడిపోయాం. నేతలు, కార్యకర్తలు బాధపడాల్సిన పనిలేదు, భయపడాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్ అడ్డగోలు హామీలను ప్రజలు నమ్మి మోసపోయారు. సీఎం రేవంత్ రెడ్డి 8 నెలల పాలనలో రాష్ట్రంలో కరెంట్ మాయమైంది. కేసీఆర్ పాలనలో కరెంట్ పోతే వార్త, రేవంత్ పాలనలో కరెంట్ ఉంటే వార్త. ఊసరవెల్లులు పాలన చేస్తే తొండలు, బల్లుల వల్ల కూడా కరెంట్ పోతుంది. నోటిఫికేషన్ ఇవ్వకుండానే 30వేల ఉద్యోగాలు ఎలా ఇచ్చారు. కాంగ్రెస్ నిజస్వరూపం తెలంగాణ యువతకు ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది. జాబ్ క్యాలెండర్ పేరుతో జాబ్‌లెస్ క్యాలెండర్ విడుదల చేశారు. రేవంత్ ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టి రుణమాఫీ అని బిల్డప్ ఇస్తోంది. ఆగస్టు 15 వచ్చినా రెండు లక్షల రుణమాఫీ కాలేదు. అందుకే రాహుల్ గాంధీ రమ్మన్నా రావడం లేదు. రేవంత్ రెడ్డి తులం బంగారం కాదు తులం ఇనుము కూడా ఇవ్వరు. ఆసరా రూ.4 వేలు పెంచుతాం అని మాట తప్పారు. బీఆర్ఎస్‌ది కుటుంబ పాలన అని విమర్శలు చేశారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా రేవంత్ రేవంత్ సోదరులే కనిపిస్తున్నారు. ఇది కుటుంబ పాలన కాదా? కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలు నెరవేర్చాలి. లేదంటే ప్రజల్లోనే వారి వైఫల్యాలను ఎండగడతాం. రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డి కంపెనీకి రూ. వెయ్యి కోట్ల టెండర్ ఇచ్చారు. రాష్ట్రం దివాళా తీసిందని రేవంత్ మాట్లాడుతున్నారు. ఇలా అబద్దాలు చెబితే ఎవరైనా నమ్ముతారా? 2019లోనే మా సర్కార్‌తో కాగ్నిజెంట్ ఒప్పందం చేసుకుంది. కాగ్నిజెంట్‌ను కాంగ్రెస్ తీసుకొచ్చినట్లుగా కవరింగ్ ఇస్తున్నారు. మాయ మాటలు, స్టంట్లతో ప్రభుత్వం ఎక్కువ రోజులు నడపలేరు' అని కేటీఆర్ పేర్కొన్నారు. '2014లో కాంగ్రెస్ సర్కార్ మాకు రాష్ట్రాన్ని అప్పజెప్పిన నాటికి తెలంగాణ రూ.300 కోట్ల రెవెన్యూ మిగులు రాష్ట్రం. 2023లో మేము తిరిగి రాష్ట్రాన్ని అప్పగించే నాటికి రూ.5 వేల 900 కోట్ల రెవెన్యూ మిగులు ఉంది. అప్పులు చేస్తే రెవెన్యూ మిగులు రాష్ట్రంగా ఎలా ఉంటుంది. బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకోవడానికి మాకేం ఖర్మ. మాకు ఒప్పందం ఉంటే మా ఇంటి ఆడ బిడ్డ ఇన్ని రోజులు జైలులో ఉంటుందా. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ వీపు చింతపండు అవుతుంది. త్వరలోనే అన్ని నియోజక వర్గాల్లో శిక్షణ తరగతులు పెడతాం. కేసీఆర్ పూర్తి చేసిన సీతారామ ప్రాజెక్ట్‌ను రేవంత్ తానే పూర్తి చేసినట్లు చెబుతున్నారు. ఈ స్టంట్లతో ప్రజలను మోసం చేయలేరు' అని కేటీఆర్ అన్నారు.

## ప్రపంచ నైపుణ్యాల
# రాజధానిగా భారత్

మొదటి పేజీ తరువాయి...

ఉన్నాయన్నారు. అన్నిరంగాల్లో ఆధునిక సాంకేతికతకు పెద్దపీట వేస్తామని, భారత్ త్వరలోనే ప్రపంచంలోనే మూడో ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందన్నారు. స్వయం సహాయక రంగాలకు ఇప్పటి వరకు రూ.9 లక్షల కోట్ల రుణాలు ఇచ్చామని, కోటి మంది మహిళలను లక్షాధికారులుగా మారుస్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. వికసిత్ భారత్ థీమ్ తో హర్ ఘర్ తిరంగా పేరుతో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు జరుగుతున్నాయని అన్నారు. దేశం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకుందామని, దేశం కోసం జీవితాలనే పణంగా పెట్టిన మహనీయులు ఎందరో ఉన్నారని, భారత ప్రస్థానం ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ప్రాణాలర్పించిన మహనీయులకు దేశం రుణపడి ఉందని, శతాబ్దాల తరబడి దేశం బానిసత్వంలో మగ్గిందని, స్వాతంత్ర్యం కోసం ఆనాడు 40 కోట్ల మంది ప్రజలు పోరాడారని, ఇప్పుడు మన దేశ జనాభా 140 కోట్లకు చేరిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. 140 కోట్ల మంది ప్రజల కలలను సాకారం చేయాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని అన్నారు. కొన్నేళ్లుగా విపత్తులు దేశాన్ని ఇబ్బందిపెట్టాయని.. ఈ సందర్భంగా విపత్తు బాధిత కుటుంబాలకు మోదీ తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సర్జికల్ స్ట్రైక్స్‌ను దేశ ప్రజలు సగర్వంగా స్మరించుకుంటున్నారని, అభివృద్ధి బ్లూ ప్రింట్‌గా సంస్కరణలు తీసుకొస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. 'నేషన్ ఫస్ట్.. రాష్ట్ర హిత్ సుప్రీం' సంకల్పంతో ముందుకెళ్తున్నామని, బ్యాంకింగ్ రంగంలో ఎన్నో సంస్కరణలు అమలుచేశామని చెప్పారు. భారత్ బ్యాంకింగ్ వ్యవస్థ ప్రపంచంలోనే బలమైందని అన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా 15 కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందని, భారత్‌లో చిరు ధాన్యాలు ప్రపంచంలో అందరికీ చేరాలని మోదీ ఆకాంక్షించారు. అంతరిక్ష రంగంలో భారత్ బలమైన శక్తిగా ఎదిగిందని, వందల కొద్దీ స్టార్టప్‌లు వచ్చాయని, ప్రైవేట్ ఉపగ్రహాలు, రాకెట్లు ప్రయోగిస్తున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మరో 10 కోట్ల మంది మహిళలు.. కొత్తగా స్వయం సహాయక సంఘాల్లో చేరారన్నారు. మౌలిక సదుపాయాల్లో పెను మార్పులు తీసుకొచ్చా మని, దేశ హితమే ప్రథమ ప్రాధాన్యమని ఆయన అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని, మన కలలు సాకారమయ్యే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. నూతన నేర చట్టాల్లో శిక్షల కంటే న్యాయానికే ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రభుత్వ ప్రమేయం అతితక్కువగా ఉండేలా పౌర సేవలు ఉంటాయని, ఎగుమతుల్లో పురోగతితో ప్రపంచ ప్రగతిలో భారత్ పాత్ర పెరిగిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. జీవన సౌలభ్యమే లక్ష్యంగా ప్రభుత్వ సేవలు అందాలని, ఒకప్పుడు సెల్‌ఫోన్లు దిగమతి చేసుకునే వాళ్లమని, ఇప్పుడు భారత్‌లోనే తయారు చేసుకుంటున్నామని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. వైద్య విద్య కోసం లక్షలు ఖర్చుచేసి విదేశాలకు వెళ్తున్నారని, విద్య కోసం విదేశాలకు వెళ్లే దుస్థితిని తప్పిస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్లలో 75వేల మెడికల్ సీట్లు రాబోతున్నాయని తెలిపారు. చంద్రయాన్ ప్రయోగం యువతలో శాస్త్రీయ ఆసక్తిని పెంచిందని, ప్రపంచానికి సేంద్రీయ ఆహారం అందించే స్థాయికి మన రైతులు చేరాలని ప్రధాని ఆకాంక్షించారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మోదీ స్పష్టం చేశారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే.. భయపడే పరిస్థితి తీసుకొస్తామన్నారు. ఇండియా 5జితోనే ఆగదని.. 6జిపైనా అధ్యయనం కొనసాగుతోందని తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా భారత్‌ను తయారుచేస్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

## స్కిల్ యూనివర్సిటీ ఛైర్మన్‌గా
# ఆనంద్ మహీంద్రా

మొదటి పేజీ తరువాయి...

బేగరికంచెలో సీఎం రేవంత్ రెడ్డి శంఖుస్థాపన చేశారు. అలాగే ముఖ్యమంత్రి ఇటీవలి కాలంలోనే ఆనంద్ మహీంద్రాతో సమావేశమై స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, లక్ష్యాలను వివరించి దానికి ఛైర్ పర్సన్ గా కొనసాగాలను కోరారు. ఈ విషయాన్ని విదేశీ పర్యటనలో న్యూయార్క్ లోని ఎన్నారైలతో భేటీలో భాగంగా.. కొత్త స్కిల్ యూనివర్సిటీ ఛైర్మన్ గా ఉండటానికి ఆనంద్ మహీంద్ర సానుకూలంగా స్పందించారని, కొద్ది రోజుల్లో ఆయన స్కిల్స్ యూనివర్సిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ ఛైర్ పర్సన్ గా ఆయన పేరును ఖరారు చేస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది.

# సీతారామ ప్రాజెక్ట్ జాతికి అంకితం

మొదటి పేజీ తరువాయి...

చేయలేదని రేవంత్ ఆరోపించారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడే ఖమ్మం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే సీతారామ ప్రాజెక్ట్‌ను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని సీఎం అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు నిధుల కోసం ఒత్తిడి చేస్తే నేను మిగతా జిల్లాల గురించి కూడా ఆలోచిస్తున్నా. ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా నిధుల కేటాయింపులో ఖమ్మం జిల్లాకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాం. కేసీఆర్ పది సంవత్సరాలు అధికారంలో ఉండి రూ.లక్షా 80 వేల కోట్లు ఖర్చు పెట్టి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు నీళ్ళు ఇవ్వలేదు. కేసీఆర్, హరీష్ బోగస్ మాటలు చెబుతారు గనుక ఆ పార్టీ నేతలు నీళ్ళ కోసం ఆందోళన చేయలేదు. నాగార్జున సాగర్ నీళ్ళు రాకపోయినా గోదావరి జలాలతో సాగర్ ఆయకట్టు కోసం వైరా లింక్ కెనాల్ చేపట్టాం. లింక్ కెనాల్ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వెంటపడి చేపించామని అన్నారు. మంత్రి తుమ్మలపై నమ్మకంతో నష్ట పరిహారం ఇవ్వక పోయినా లింక్ కెనాల్‌కు రైతులు భూములు ఇచ్చారు. హరీష్ రావు దూలంలాగా పెరిగారు కానీ బుద్ధి పెరగలేదు. రీ డిజైన్ పేరుతో ప్రాజెక్ట్ అంచనాలు పెంచారు. కమిషన్ల కోసం పంప్ మోటార్లు పెట్టారు. నాలుగేళ్లుగా పంప్ హౌస్ కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. ఆరు నెలలు రేయింబవళ్లు కష్టపడి పంప్ హౌస్‌లో నీరు పారేలా చేశాం. కృష్ణా జలాలు రాక పోయినా ఖమ్మం జిల్లాకు గోదావరి నీళ్ళు అందే అవకాశం ఉంది. పొరుగున ఉన్న నల్గొండ జిల్లాతో నీటి పంచాయితీ లేకుండా గోదావరి నీళ్లతో ఖమ్మం జిల్లాలో ఆయకట్టుకు నీరు అందిస్తాం. హరీశ్ అభినందించక పోయినా ఫర్వాలేదు కానీ అవమానించేలా మాట్లాడొద్దు. రానున్న రోజుల్లో 80 శాతం పూర్తయిన ప్రాజెక్టులను మొదటి దశ ప్రాధాన్యంగా పూర్తి చేస్తాం' అని రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు మిత్తి కట్టడానికి కొత్త అప్పులు తేవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు సీఎం రేవంత్. ఖమ్మం జిల్లాకు ప్రాధాన్యత ఇచ్చి ప్రాజెక్టులు పూర్తి చేశామన్నారు. బీఆర్ఎస్ నేతలు నాలుగేళ్లుగా సీతారామ ప్రాజెక్ట్ పంపులను ఆన్ చేయలేదన్నారు. తాము నీళ్లు చల్లుకోలేదు..గోదావరి తల్లి తమ మీద నీళ్లు చల్లిందన్నారు. నల్గొండ జిల్లాలోనూ అనేక ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయని చెప్పారు రేవంత్. పాలమూరు జిల్లాలోనూ పరిస్థితులు అలాగే ఉన్నాయని చెప్పారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను కేసీఆర్ కుటుంబం విధ్వంసం చేసిందన్నారు. 1500 కోట్లతో పూర్తి కావాల్సిన ఇందిరా సాగర్ ప్రాజెక్టును ..18వేల కోట్ల అంచనాకు పెంచారని చెప్పారు సీఎం రేవంత్. రూ. 7500 కోట్లు ఖర్చు చేసి చుక్కనీరు గుంట భూమికి ఇవ్వలేదని ధ్వజమెత్తారు. తమ మంత్రుల మధ్య ఎంతో పోటీ ఉందని.. అందుకే గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు పారించాలనే ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ప్రాజెక్టులను నాలుగు భాగాలుగా విభజించామన్నారు. 80 శాతం పెరిగి ..60శాతం, 4 శాతం,20 శాతం ప్రణాళిక ప్రకారం ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామన్నారు. గోదావరినీటిని కృష్ణా పరివాహక ప్రాంతాలకు తరలించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చేతులు మీదుగా సీతారామ ప్రాజెక్ట్ 3వ పంప్ హౌస్ ను గురువారం ప్రారంభించారు. అధికారులు అన్ని ఏర్పాట్లు చేసి.. ఉపముఖ్యమంత్రి భట్టిని ఆహ్వానించారు.ఆయన ప్రత్యేక పూజలు చేసి పంపి హౌస్‌ని ప్రారంభించారు. ములకలపల్లి మండలం కమలాపురం దగ్గర మధ్యాహ్నం 12 గంటలకు సీతారామ ప్రాజెక్ట్ పంప్ హౌస్ 3 ని తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క చేతులు మీదుగా ప్రారంభించారు. కాగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీతారామ ప్రాజెక్ట్ పూసుగూడెం దగ్గర రెండవ పంప్ హౌస్ ను ఈరోజు ప్రారంభించారు.సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాకు త్వరగా నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, హరిప్రియ నాయక్ నిరసనకు దిగారు. దీంతో వారిని పోలీసులు ముందుగానే అరెస్ట్ చేశారు. ఈ పథకం కింద 3.29 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు, 3.45 లక్షల ఎకరాల స్థిరీకరణ ఆయకట్టుకు నీరివ్వాలన్నది లక్ష్యం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జలయజ్ఞం కింద నాలుగు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించేందుకు రాజీవ్‌సాగర్, ఇందిరా సాగర్ ఎత్తిపోతల పథకాలను అప్పటి ప్రభుత్వం చేపట్టింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత పునరాకృతిలో భాగంగా నిర్మాణంలో ఉన్న రెండు ఎత్తిపోతల పథకాల స్థానంలో 'సీతారామ'కు గత భారాస ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2016 ఫిబ్రవరి 16న రూ.7,926 కోట్లతో దీనికి పరిపాలనా అనుమతి ఇచ్చింది. 2018లో ఈ అంచనా వ్యయం రూ.13,057.98 కోట్లకు పెరిగింది. ఇప్పటికే చేపట్టిన పనులకు పెరిగిన ధరలు, ఇంకా టెండర్లు పిలవాల్సిన డిస్ట్రిబ్యూటరీ పనులకు కలిపి సుమారు రూ.18,600 కోట్ల వ్యయమవుతుందని అంచనా. ఇప్పటి వరకు రూ.7,919.65 కోట్లు ఖర్చుచేయగా సుమారు మరో రూ.పదివేల కోట్లు వ్యయం చేయాల్సి ఉంటుంది.



## రాజ్‌భవన్‌లో ఎట్‌హోమ్‌కు
# సీఎం రేవంత్ హాజరు

మొదటి పేజీ తరువాయి...

అధిష్ఠానం పెద్దలతో మాట్లాడనున్నారు. ఇటీవలే అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన సీఎం మరోసారి ఢిల్లీకి వెళ్లనుండడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండ్రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఆపిల్, ఫాక్స్ కాన్ కంపెనీ ప్రతినిధులతో సమావేశం కానున్నారు. తెలంగాణలో పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనపై వారితో చర్చించనున్నారు. అలాగే శనివారం రోజున కాంగ్రెస్ హై కమాండ్‌తో భేటీ కానున్నారు. నూతన పీసీసీ చీఫ్, మంత్రి వర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టులపై కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీలతో సీఎం రేవంత్ చర్చించనున్నారు. రాష్ట్ర సచివాలయం ఎదురుగా ఏర్పాటు చేయనున్న రాజీవ్ గాంధీ విగ్రహం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సోనియా గాంధీని ఆహ్వానించనున్నారు. అలాగే వరంగల్‌లో నిర్వహించే రైతు కృతజ్ఞత సభకు రాహుల్ గాంధీని ఆహ్వానిస్తారు. అదే రోజు సాయంత్రం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు.

## సీఎం స్థాయికి తగ్గట్లుగా
# రేవంత్ ప్రవర్తించడం లేదు

మొదటి పేజీ తరువాయి...

చేస్తున్నారు. సోనియాగాంధీ పుట్టిన రోజు కానుగా డిసెంబరు 9 నాటికి రూ.40వేల కోట్ల రైతు రుణాలు మాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి చెప్పారు. అది నెరవేర్చలేక పార్లమెంట్ ఎన్నికలకు ముందు మరో నాటకానికి తెరలేపారు. సోనియా మీద ఒట్టు పెట్టినా, దేవుళ్ల మీద ఒట్టు పెట్టినా అబద్ధమే అతని లక్షణం. మేము మొదటి దఫాలో రూ.లక్ష రుణమాఫీ చేస్తేనే 35లక్షల మంది రైతులకు రూ.17వేల కోట్లు అయ్యింది. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా రూ.2లక్షల రుణమాఫీ చేస్తే 22 లక్షల మంది రైతులే ఉంటారా? రూ.17,869 కోట్లు మాత్రమే అవుతాయా? ఈ ఒక్క విషయంతోనే వీరి రుణమాఫీ పచ్చి అబద్ధం అని తెలిపోయింది. వీరిరు దగా చేశారన్నది స్పష్టంగా తేలిపోయిన తర్వాత రాజీనామా ఎవరు చేయాలి?. రేవంత్‌రెడ్డి ఏ దేవుళ్ల మీద ఒట్టుపెట్టి మాట తప్పారో ఆ దేవుళ్లందరి వద్దకు స్వయంగా నేనే వెళ్తా. ఆయన చేసిన తప్పు తెలంగాణ ప్రజలకు ముప్పుగా మారొద్దని ప్రార్థిస్తా‘ అని హరీశ్‌రావు తెలిపారు.

## సాగర్ ఆయకట్టుకి
# గోదావరి జలాలు తరలింపు లక్ష్యం

**జిల్లాలోని 6.74లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం**

**రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



ఖమ్మం, ఆగస్ట్ 15 (ప్రభాత ఉదయం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాగార్జున సాగర్ ఆయకట్టుకి గోదావరి జలాలు తరలించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జిల్లాలోని 6.74లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు తుమ్మల తెలిపారు. వ్యవసాయానికి గోదావరి జలాలు అందించేందుకు భద్రాద్రి రాముడి సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటిచ్చారని మంత్రి చెప్పారు. అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా వైరాలో ఏర్పాటు చేసిన మూడో విడత రైతు రుణమాఫీ భారీ బహిరంగ సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. రాజీవ్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకి గోదావరి జలాలు అందించడం కోసం సీతారామ ప్రాజెక్టు మూడు పంపు హౌస్‌లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ప్రారంభించినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కేవలం మూడు, నాలుగు నెలల్లోనే రూ.600 కోట్లతో సీతారామ ప్రాజెక్టు స్ట్రక్చర్స్ ఏర్పాటు చేసి నీళ్లు విడుదల చేసినట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గంలో రాజీవ్ కెనాల కోసం భూములు ఇచ్చిన రైతన్నలకు చేతులెత్తి నమస్కరించారు. భూములు ఇచ్చిన ప్రతి అన్నదాతకూ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దేవుడు దయవల్ల కృష్ణా, గోదావరి జలాలు ఖమ్మం జిల్లాకు వచ్చాయంటూ మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. జిల్లాలో నాగార్జున సాగర్ ఆయకట్టు కింద పంటలకు సాగునీరు అందించే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తున్నట్లు మంత్రి తుమ్మల చెప్పారు. సీతారామ ప్రాజెక్టు మిగులు పనులకు రూ.10వేల కోట్లు ఖర్చయినా ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే నాలుగేళ్లల్లో పూర్తి చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి జలాలు తరలించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, జిల్లా రైతుల కోరికని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

# ఆర్యన్ స్కూల్లో.... అట్టహాసంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజినీ నాయుడు వేషధారణతో కోట్ల రుత్వీక



మహనీయుల వేషధారణతో చిన్నారులు

రాజేంద్రనగర్, ఆగస్టు 15 (ప్రభాతఉదయం) మూడు రంగుల అందంతో... ధర్మచక్ర చిహ్నంతో..... ధరణి పైనుంచి సిరుల వాన కురిసినట్టు... అడుగడుగునా... వాడవాడలా మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. నగర శివారు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎంతో వైభవంగా జరుపుకున్నారు. స్వాతంత్రం తెచ్చిపెట్టిన మహనీయులను స్మరించుకుంటూ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నేటితరం విద్యార్థులు నాటి మహనీయులను గుర్తుంచుకునేలా.... ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల, ఉపాధ్యాయులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించారు. మహనీయుల వేషధారణతో పలువురు చిన్నారులు ఆలరించారు. మరోవైపు నియోజకవర్గంలోని ప్రతి వాడవాడలో దేశభక్తి గీతాలు మార్మోగాయి.

**ఆర్యన్ స్కూల్లో.....**

రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్దేపల్లి డివిజన్ ప్రగతి కాలనీలోని ఆర్యన్ స్కూల్లో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ మహేందర్ రెడ్డి జాతీయ పథకం ఆవిష్కరించగా,.... ఉపాధ్యాయులు స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం



సంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన పలు సంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని స్వాతంత్ర దినోత్సవం ఎంతో సంతోషంగా నిర్వహించుకున్నారు. బుడిబుడి నడకల చిన్నారుల సైతం స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణతో ఆకట్టుకున్నారు. అనంతరం ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో పాఠశాల ఆవరణ పూర్తిగా పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఖైరతాబాద్ లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండాకు వందనం స్వీకరిస్తున్న ఎండి అశోక్ రెడ్డి

## జలమండలిలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

హైదరాబాద్, ఆగస్టు15(ప్రభాత ఉదయం)జలమండలిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. గురువారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలకు ఎండీ అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై.. త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. జలమండలి వినియోగదారులు, ఉద్యోగులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో ఈఎన్ సి %డ% రెవిన్యూ డైరెక్టర్ వీఎల్. ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, సీజీఎంలు ఎం అమరేందర్ రెడ్డి, ఖాజామోహినుద్దీన్ యునియన్ నాయకులు, ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





హెల్పింగ్ హాండ్స్ సొసైటీ నూతన కమిటీ

## హెల్పింగ్ హాండ్స్ సొసైటీ అధ్యక్షులుగా జి బాలకృష్ణ

బుద్వేల్, ఆగస్టు15(ప్రభాత ఉదయం) : బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనీకి చెందిన హెల్పింగ్ హాండ్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షులుగా జి బాలకృష్ణ నియమితులైనారు. గురువారం జరిగిన సంఘం ఏడవ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. పూర్వ కమిటీ అధ్యక్షులు ఎస్ రామ్మోహన్ , ప్రధాన కార్యదర్శి జి బాలకృష్ణ , కోశాధికారి ఠాకూర్ కిషన్ సింగ్ లతోపాటు పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

**నూతన కమిటీ :**

హెల్పింగ్ అండ్ సొసైటీ అధ్యక్షులుగా జి బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పెండ్యాల వినోద్ కుమార్, కోశాధికారిగా ఎస్ వెంకటేశ్ నియమితులయ్యారు. రాబోయే రెండు సంవత్సరాల పాటు వీరు ఈ పదవిలో ఉంటారన్నారు. ఈ సందర్భంగా సంఘం పూర్వ అధ్యక్షులు సుంకర రామ్మోహన్ మాట్లాడుతూ, 2018లో హెల్పింగ్ హాండ్స్ సొసైటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 11 మందితో ప్రారంభమైన ఈ సంఘం నేడు 27 మందితో కొనసాగుతుందన్నారు. ఇప్పటివరకు సంఘం టర్నోవర్ 13.25 లక్షలకు చేరుకుందన్నారు . పొదుపులు చేయడం అప్పులు ఇవ్వడం జరుగుతుందన్నారు.



పాతబస్తీలో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో జెండా ఎగరవేసిన హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

## పాతబస్తీలో పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొన్న ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

చార్మినార్,ఆగస్టు15(ప్రభాత ఉదయం) 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా పాతబస్తీ లో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో హైదరాబాద్ పార్లమెంటు సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ పాల్గొని జాతీయ జెండాను ఎగరవేశారు. గురువారం ఎం ఐ ఎం అధ్యక్షులు,హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పాత బస్తీ మహ్మద్ కాప్ మార్ట్ వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.





## బుద్వేల్ చౌరస్తాలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

### జాతీయ జెండా ఎగురవేసిన బిజెపి దళిత మోర్చా కార్యవర్గ సభ్యులు కోరని సదానందం

రాజేంద్రనగర్, ఆగస్టు15(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ ఇందిరాగాంధీ చౌరస్తాలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు బిజెపి దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరని సదానందం ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.






గంజాయి ని తీసుకువస్తున్న దంపతులను అరెస్ట్ చేసి ప్రశ్నిస్తున్న అత్తాపూర్ పోలీసులు

## అత్తాపూర్ ఫారెస్ట్ ఆఫీస్ వద్ద గంజాయితో ఉన్న భార్యా భర్తల అరెస్ట్

బుద్వేల్, ఆగస్టు15 (ప్రభాత ఉదయం) : సంగారెడ్డి నుంచి ఎం ఎం పహాడికి 1.9 కిలోల గంజాయిని తీసుకొస్తున్న భార్యాభర్తలను అత్తాపూర్ పోలీసులు గురువారం సాయంత్రం అత్తాపూర్ ఫారెస్ట్ ఆఫీసు వద్ద ఆరెస్టు చేశారు. వారి నుంచి 1.9 కిలోల గంజాయిని , యాక్టివా ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు . వివరాలు ఈ విధంగా ఉన్నాయి..... రాజేంద్రనగర్ సర్కిల్ ఎంఎం పహడి సమీపంలోని కోహినూర్ హెూటల్ సమీపంలో నివాసం ఉంటూ కారు నడిపే షకీల్ హైమద్ షేక్ (53), ఆయన భార్య మెహర్ షకిల్ షేక్ (38) టీఎస్ 07.కె ఈ 5713 నెంబర్ యాక్టివా ద్విచక్ర వాహనంపై సంగారెడ్డి నుంచి 1.9 కిలోల గంజాయిని తీసుకువస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు అత్తాపూర్ పోలీసులు అత్తాపూర్ సమీపంలో గల రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయం పక్కన ఉన్న ఫారెస్ట్ ఆఫీస్ వద్ద వల పని పట్టుకున్నారు . వారి నుంచి 1.9 కిలోల గంజాయితోపాటు యాక్టివా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసును అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ వెంకటరామిరెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.



ఎన్ ఎస్ యు ఐ నాయకుడు అభిషేక్ కు పార్టీ కండువా కప్పి స్వాగతిస్తున్న బిఆర్ఎస్ యువనేత కార్తీక్ రెడ్డి

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం ఖాయం

### బిఆర్ఎస్ యువనేత కార్తీక్ రెడ్డి

### టిఆర్ఎస్ లో చేరిన ఎన్ ఎస్ బి ఐ నాయకుడు.

శంషాబాద్,ఆగస్టు 15( ప్రభాత ఉదయం) శంషాబాద్ మండల ఎన్ ఎస్ యు ఐ నాయకుడు అభిషేక్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి సమక్షంలో బిఆర్‌లో చేరారు. అభిషేక్ తోపాటు దాదాపుగా 50 మంది ఎన్ఎస్‌యుఐ నాయకులు కార్యకర్తలు గులాబీ కండువా కప్పుకున్నారు ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉన్న భ్రమలు తొలగిపోతున్నాయని ప్రజలు కెసిఆర్ నాయకత్వాన్ని తిరిగి కోరుకుంటున్నారని అన్నారు. 8 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు మరింత పెరిగిపోయాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగిన ప్రజలు టిఆర్ఎస్ పార్టీకి పటం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని కార్తిక్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా డిసిసిబి డైరెక్టర్, మల్కారం పిఏసిఎస్ చైర్మన్ బూర్కుంట సతీష్,బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దిద్యాల శ్రీనివాస్, లీగల్ సెల్ నాయకుడు కొనమొల్ల శ్రీనివాస్, కూచిరెడ్డి శంకర్ రెడ్డి,శంషాబాద్ ప్రధాన కార్యదర్శి మోహన్ రావు. గౌస్ పాషా. బూర్కుంట మహేష్ . నందిగామ రాజశేఖర్ గౌడ్. చిన్నగండు రాజేందర్.నాగం గిరిముదిరాజ్. గూడెపు అశోక్ సేగు అశోక్ కుమార్.. చలివేంద్రి వెంకట్ రెడ్డి .నాగేష్ ముదిరాజ్. తదితరులు పాల్గొన్నారు.





రాజేంద్రనగర్ నవ జ్యోతి యూత్ క్లబ్ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు

## రాజేంద్రనగర్ వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా ఈ.శ్రీకాంత్

బుద్వేల్, ఆగస్టు15(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా వీర్లపల్లి శ్రీకాంత్ నియమితులైనారు. గురువారం యూత్ క్లబ్ ఆవరణలో క్లబ్ పెద్దల సమక్షంలో నూతన కమిటీని నియమించారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉపాధ్యక్షులుగా పి ఈశ్వర్, పీర్లగూడెం వెంకట స్వామి, ప్రధాన కార్యదర్శిగా ఎన్. వెంకటేష్ , సంయుక్త కార్యదర్శిగా జి. రాకేష్, కార్య నిర్వాహక కార్యదర్శులుగా జి భరత్ రామ్, ఏం శర్వాన్, కోశాధికారిగా వేణుగోపాల్, ఉపకోషాధికారులుగా కార్తీక్, ఎం శ్రీకాంత్ , జి శ్రీనివాస్ , భజన మండలి సభ్యులుగా జి రాములు , ఎం శ్రీనివాస్, ఎం. రాబాబు యాదవ్ , ఎం నాగభూషణం , బి రాజేందర్, ఎస్ జగదీశ్వర్ , ఎస్ వెంకటేశం, వి వెంకటేశం, పి జంగయ్యలు ఎంపికయ్యారు.

## సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాల కన్వీనర్‌గా ముద్దగోని భాస్కర్ గౌడ్



రాజేంద్రనగర్, ఆగస్ట్ 15(ప్రభాత ఉదయం)సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాల రాష్ట్ర కన్వీనర్ గా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్ కు చెందిన డివిజన్ మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు ముద్దగొని భాస్కర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరగనున్న ఈ కమిటీ నియామక ఉత్తర్వులు జారీ చేసింది.





కొత్తకోట శ్రీ వేంకటేశ్వర ఐటిఐ కళాశాలలో జాతీయ జెండా నెరవేస్తున్న కళాశాల చైర్మన్ వి గంగాధర్

## కొత్తకోట పట్టణ, మండలంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

కొత్తకోట,ఆగస్టు15(ప్రభాత ఉదయం) కొత్తకోట పట్టణ, మండల పరిష పరిషత్ కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయం,మహిళా సమాఖ్య భవనం , శ్రీ వెంకటేశ్వర ఐటిఐ కళాశాల లో కళాశాల చైర్మన్ వి గంగాధర్, ప్రిన్సిపల్ జీవి జయప్రకాష్ లో జాతీయ జెండాను ఎగరవేశారు.కొత్తకోట చౌరస్తా లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్, మాజీ ఎంపీపీ ,మాజీ జెడ్పీటీసీ, ఐటిఐ కళాశాల చైర్మన్, గ్రామ పెద్దలు, గ్రామ యువకులు ,వివిధ పార్టీల నాయకులు, స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.



కిషన్ బాగ్ డివిజన్ బిఆర్ ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్ జాతీయ జెండా ఆవిష్కరించారు.

## హైదర్‌గూడలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

### జాతీయ జెండా ఎగురవేసిన బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కోలన్ సుభాష్ రెడ్డి

రాజేంద్రనగర్, ఆగస్ట్ 15(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడ లో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా గురువారం హైదర్ గూడ చౌరస్తాలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కో ఆప్షన్ సభ్యులు కొలన్ సుభాష్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా సుభాష్ రెడ్డి మాట్లాడుతూ... ఎందరో స్వాతంత్ర సమరయోధుల పోరాటాల ఫలితంగా దేశాన్ ని కి స్వాతంత్రం సిద్ధించిందని దేశభక్తుల ఆశయాలకు కోసం నేటి యువత ముందుకు సాగాలన్నారు.ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోంద్ర సంగీత గౌరీ శంకర్, మాజీ కౌన్సిలర్ సోమవారం రవీందర్,ప్రణవ భక్త సమాజ అధ్యక్షులు మొంద్ర నర్సింహ, స్థానిక నాయకులు సిహెచ్. నరేందర్, ఆర్ జంగయ్య, సనివెల్లి శేఖర్ రెడ్డి, భైగర్ల లక్ష్మణ్, ఎం.కొమ్రయ్య, సదానంద్, మల్లా రెడ్డి, సుధాకర్ రెడ్డి, బి రమేష్, వనం నర్సింహ, సోమారపు రాజ్ కుమార్, రాము యాదవ్, వార్డు మెంబర్ మల్లేష్, కె హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.





హైదర్ గూడ చౌరస్తాలో జాతీయ జెండా ఎగురవేస్తున్న బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కోలన్ సుభాష్ రెడ్డి

# గద్వాల జిల్లా కేంద్రంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు







## త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు ఎ. పి. జితేందర్ రెడ్డి

## ఉత్సాహభరితంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు


గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు15(ప్రభాత ఉదయం)జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పండుగ వాతావరణంలో స్వతంత్ర దినోత్సవ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ముఖ్య అతిథిగా ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి %ు% ప్రభుత్వ సలహాదారు (క్రీడా వ్యవహారాలు) ఎ.పి. జితేందర్ రెడ్డి విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పుర ప్రముఖులను, అధికార అనధికారులను కలిసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, జిల్లాలో సాధించిన ప్రగతిని ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుందని, ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయహస్తం హామీలను ఒక్కొక్కటిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచే అమలు చేయడం ప్రారంభించిందని అన్నారు. ఇందిరమ్మ గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి పథకాలు అమలు చేస్తు%శీ%దని అన్నారు. రాష్ట్రంలో ఆడపడుచులకు , ట్రాన్స్ జెండర్లకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందాని, జోగులాంబ గద్వాల జిల్లాలో ఇప్పటివరకూ 86లక్షల 32వేల 171 మంది మహిళలు ఈ ఉచిత రవాణా సౌకర్యాన్నికి 30కోట్ల 68లక్షల రూపాయలు లబ్ధి చేకూరిందని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం లో భాగంగా పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా, 5 లక్షల నుండి 10 లక్షల రూపాయల వైద్య పరిమితి పెంచడం వల్ల జోగులాంబ గద్వాల జిల్లాలో 3,830 మంది పేదలు చికిత్సలు పొందగలిగారని అన్నారు. నిరుపేదలైన ప్రతి ఒక్కరికీ సొంత ఇంటికల నిజం చేయాలని ఇందిరమ్మ ఇళ్ళ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలుపరుస్తోందని, ఈ పథకం క్రింద 4 లక్షల 50 వేల గృహాలు నిర్మాణాలకు , ప్రతి నియోజకవర్గంలో 3,500 గృహాలు నిర్మించడం జరుగుతుందన్నారు. మహాలక్ష్మి పథకం కింద కేవలం 500 రూపాయలకే వంట గ్యాస్ సరఫరా చేసే కార్యక్రమం చేపడుతోందని, దీని వల్ల జిల్లాలో 87,751 మందికి లబ్ధిచేకూరుతోందని, ఇప్పటివరకూ 48,683 మంది వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయడం జరిగిందని దీనికి గాను ప్రభుత్వం 1 కోటి 29 లక్షల 72 వేల రూపాయల సబ్సిడీ అందించబడుతోందని అన్నారు. గృహజ్యోతి కార్యక్రమం కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తుందని, జిల్లాలో ఇప్పటి వరకూ 1 లక్ష 40 వేల 440 జీరో బిల్లులు జారీ చేయబడ్డాయని మొత్తం 76,358 కుటుంబాలకు లబ్ధిచేకూరుతోందని , ఈ పథకం కింద ఇప్పటి వరకూ ప్రభుత్వం 3కోట్ల 67లక్షల 68వేల రూపాయలను సబ్సిడీ అందజేసిందని అన్నారు. దేశంలో ఎన్నడూ జరగని రీతిలో ఇచ్చిన హామీ మేరకు 2లక్షల రూపాయల వరకు రైతుల రుణమాఫీ చేసి రాష్ట్ర ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని, జిల్లాలో రైతు రుణమాఫీ పథకం కింద మొత్తం 41,638 మంది రైతన్నలకు 318కోట్ల 83లక్షల రూపాయల రుణమాఫీ జరిగిందని అన్నారు.అనంతరం బాల భవన్ విద్యార్థులచే దేశ భక్తి నృత్యం, పంజాబీ నృత్యన్ని పలువురునీ అలరించింది. కే.జి.బి.వి బాలికల ఉ ండవెల్లి విద్యార్థులచే పిరమిడ్స్ ప్రదర్శన, ఎస్. ఆర్ విద్యానికేతన్ విద్యార్థులచే నృత్యం, మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శన, "కే.జి.బి.వి బాలికల గద్వాల్ విద్యార్థులు చెట్ల ప్రాముఖ్యత తెలియజేస్తూ అందమైన నృత్యం తో అలరించారు. దేశభక్తి ఉట్టిపడేలా ప్రగతి విద్యాలయం విద్యార్థులు నృత్యాన్ని ప్రదర్శించారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలలో పని చేసి ఉత్తమ సేవలు అందించిన అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. తదనంతరం వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వికలాంగులకు ఎలెక్ట్రానిక్ ట్రై సైకిల్స్ మూడు , ట్రై సైకిల్స్ తొమ్మిది అందజేశారు.ఐడీఓసీలో జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు అంతకు ముందు జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా అధికారులతో కలసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, స్వాత్రంత్ర సమర యోధులకు ఘనంగా నివాళు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు ,గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అదనపు కలెక్టర్లు నర్సింగ రావు, శ్రీనివాస రావు, ఆర్.డి.ఓ రామ్ చందర్, ఏ. ఓ. వీరభద్రప్ప, అడిషనల్ ఎస్పీ గుణ శేఖర్ , వివిధ శాఖల జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆదిత్య టాలెంట్ హై స్కూల్ లో చిన్నారులతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



కాటేదాన్ బీజేపీ కార్యాలయం వద్ద జెండా ఎగుర వేసిన మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



రాజేంద్రనగర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద జెండా ఎగురవేసిన గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పి. అర్చన జయ ప్రకాష్

## రాజేంద్రనగర్ సర్కిల్‌లో జెండా ఎగుర వేసిన ప్రజా ప్రతినిధులు

బుద్వేల్, ఆగస్టు15(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ లో గురువారం జరిగిన 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ తో పాటు కార్పొరేటర్లు జాతీయ పతాకాలను ఎగురవేశారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జెండా ఎగరవేయగా, అత్తాపూర్ కార్పొరేటర్ ఏం సంగీత గౌరీ శంకర్ హైదర్ గూడ గాంధీ విగ్రహం వద్ద, మైలార్ దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి కాటేదాన్ లోని బీజేపీ కార్యాలయం వద్ద, రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పి అర్చన జయప్రకాష్ రాజేంద్రనగర్ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద జాతీయ పతాకాలను ఎగురవేసి స్వాతంత్ర సమరయోధులను స్మరించుకున్నారు. హైదర్ గూడ సెంటర్ లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి మువ్వన్నెల జెండా ను ఎగుర వేశారు.



హైదర్ గూడ సెంటర్‌లో జెండా ఎగురవేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి



హైదర్ గూడ గాంధీ విగ్రహం వద్ద జెండా ఎగుర వేస్తున్న అత్తాపూర్ కార్పొరేటర్ ఎం. సంగీత గౌరీశంకర్



రాజేంద్రనగర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద జెండా ఎగర వేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## సిఐటియు అనుబంధంగా ఉన్న సంఘంలో చేరిన ఆమనగల్

# మహాత్మా గాంధీ భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు

బుద్వేల్, ఆగస్టు15(ప్రభాత ఉదయం) : ఆమనగల్ కు చెందిన మహాత్మా గాంధీ భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు పెద్ద ఎత్తున గురువారం సీఐటీయూ అనుబంధంగా ఉన్న భవన నిర్మాణ కార్మిక సంఘం లో చేరారు. ఈ సందర్భంగా ఆమనగల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) అధ్యక్షుడు సుంకర రామ్మోహన్ మాట్లాడుతూ, సీఐటీయూ అనుబంధంగా ఉన్న భవన నిర్మాణ కార్మిక సంఘం లో సభ్యత్వం కలిగి ఉంటే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలకు అర్హులుగా ఉండడానికి కావలసిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు . భవన నిర్మాణ కార్మిక సంఘం కు తెలంగాణలో బలమైన సభ్యత్వం, నాయకత్వం ఉందన్నారు. త్వరలోనే ఆమనగల్ లో ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్మికులందరికీ సీఐటీయూ తరపున సభ్యత్వం ఇవ్వడం జరుగుతుందన్నారు.



సీఐటీయు అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం లో చేరుతున్న అమన్ గల్ మహాత్మా గాంధీ భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు



అమన్ గల్ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులతో మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకర రామ్మోహన్



సెయింట్ అల్ఫోన్సా కారుణాలయం లో దుప్పట్లు , పండ్లు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హాండ్స్ సొసైటీ సభ్యులు





దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న సభ్యులు





దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు






దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

# మానసిక వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేసిన హెల్పింగ్ హాండ్స్ సొసైటీ సభ్యులు

బుద్వేల్, ఆగస్టు15(ప్రభాత ఉదయం): బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనీకి చెందిన హెల్పింగ్ హాండ్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం కాలనీలోని సెయింట్ అల్ ఫోన్సా కారుణాలయంలో మానసిక వికలాంగులకు 150 దుప్పట్లు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షులు ఎస్ రామ్మోహన్ , ప్రధాన కార్యదర్శి జి బాలకృష్ణ , కోశాధికారి ఠాకూర్ కిషన్ సింగ్ ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మానసిక వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. తమ సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధ్యక్షుడు ఎస్. రామ్మోహన్ తెలిపారు .



# జాతీయ జెండా ఆవిష్కరించిన సింగిల్ విండో ఛైర్మన్ దవణాకర్ గౌడ్

శంషాబాద్, ఆగస్టు 15( ప్రభాత ఉదయం) అమరుల త్యాగాలను స్మరించుకోవాలని చిన్న గోల్కొండ సింగిల్ విండో ఛైర్మన్ దవణాకర్ గౌడ్ సూచించారు. లక్షలాదిమంది త్యాగధనులు చేసిన ప్రాణదానాలు బలిదానాల కారణంగానే భారతదేశానికి విముక్తి లభించిందని ఆయన పేర్కొన్నారు. 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా చిన్న గోల్కొండ సింగిల్ విండో కార్యాలయం వద్ద గురువారం ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విదేశీ పాలనలో మగ్గిన భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించడంలో ఎంతోమంది అమరులు తమ ప్రాణాలను తృణప్రాయంగా భావించి బలిదానం చేశారని అన్నారు. వారి త్యాగాలను బలిదానాలను సదాస్మరించుకుంటూ దేశంపై గౌరవాన్ని భక్తిని పెంపొందించుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మోహన్ రావు. రైతులు సహకార సంఘం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలలో జెండా పండుగ

బుద్వేల్, ఆగస్టు15(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ లోని ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం జెండా పండుగలు ఘనంగా జరిగాయి . వ్యవసాయ విశ్వవిద్యాలయం, జలమండలి, జీహెచ్ఎంసీ, కార్యాలయాలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలలో కూడా స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జెండా ఎగుర వేసి సెల్యూట్ చేస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ పి. రఘురామిరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు



నార్మ్ లో జెండా ఎగుర వేస్తున్న ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు



మైలార్ దేవ్ పల్లి విజేత టాలెంట్ స్కూల్ లో జరిగిన జెండా వందనం కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ ఐ రాములు



జలమండలి బుద్వేల్ ఫిల్టర్ బెడ్స్ వద్ద జరిగిన జెండా కార్యక్రమంలో పాల్గొన్న జలమండలి అధికారులు



రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో జెండా ఎగుర వేసిన డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్



శివరాంపల్లి నైట్ షెల్టర్ లో జెండా ఎగుర వేస్తున్న గ్రెస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు ఎ. సదాలక్ష్మి



మాణిక్యమ్మ కాలనిలో జెండా వేడుకలలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్



చింతల్ మెట్ లో నవాజుద్దీన్, షేక్ నయీమ్



బాబుల్ రెడ్డి నగర్ శ్రీ విద్యానికేతన్ హై స్కూల్ లో జెండాకు వందనం చేస్తున్న మాజీ కౌన్సిలర్ ఎస్. వెంకటేష్, పాఠశాల కరస్పాండెంట్ బోయ లక్ష్మణ్



హైదర్ గూడ బాబు జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ హాల్ లో



రాజేంద్రనగర్ నవ జ్యోతి యూత్ క్లబ్ ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



ఉప్పర్ పల్లి లో జెండా ఎగుర వేస్తున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి చిత్రంలో బొక్క బాల్ రెడ్డి

# దేశప్రజలు ఆనందంతో పాటు, బాధ్యతతో స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవాలి

## ఉప్పర్ పల్లి బీజేపీ కార్యలయంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

బుద్వేల్, ఆగస్టు15(ప్రభాత ఉదయం) : 78 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా బీజేపీ యువ మోర్చా రాష్ట్ర నాయకులు బొక్క బాల్ రెడ్డి అధ్వర్యంలో రాజేంద్రనగర్ ఉప్పర్ పల్లి బీజేపీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిధి గా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,చాల దేశాలకి స్వాతంత్ర్యం వచ్చాక శాంతి నెలకొందని, భారత దేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత కూడా, అశాంతి, సవాళ్లు ఉంటూనే ఉన్నాయని తెలిపారు. వీటిని అధికమించటానికి ప్రజలంతా భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం లో,రెస్పాన్సిబిలిటీ తో ఉండాల న్నారు. అనంతరం యువ మోర్చా నాయకులు బొక్క బాల్ రెడ్డి స్థానిక బ్యాడ్మింటన్ అకాడమీ లో జాతీయ జెండా ఎగరవేశారు. ఉప్పర్ పల్లిలో జాతీయ జెండా ఎగరవేశారు సన్రైజ్ హోమ్ లో కొండా విశ్వేశ్వర్ రెడ్డి తో జండా కార్యక్రమంలో పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్. విఠల్, శీను ముదిరాజ్ , గోనే శ్రీకాంత్ రెడ్డి , పుస్తకాల నర్సింగ్ రావు, అశోక్ రెడ్డి , శ్రీనివాస్ రెడ్డి, రవి, సప్న , పవన్ , అజయ్ కాంత సాగర్ రెడ్డి , గోనె మోహన్ రెడ్డి , కర్ణాకర్ గౌడ్ , మహేష్ ముదిరాజ్ , గోనే అశోక్ రెడ్డి, నర్సింగ్, రాము , ముఖేష్ , ఇంద్రారెడ్డి పెంటా రెడ్డి , పతి జైదీప్ రాజ్ , పతి కవి రాజ్ , పతి విజయ్ వర్ధన్, మనుక సురేష్ కుమార్ యాదవ్ , బాసరం నాగరాజు , మునుగల క్రాంతి కుమార్, నీరుడి నవీన్ కుమార్, రామ్ పవన్ , ఉదయ్ చారి, శ్రీకాంత్ గౌడ్ లు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH.** “**RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.